# పాండవ స్వర్గారోహణము


## హరికథ



చిత్రకవితా విశారద జీరెడ్డి చెన్నారెడ్డి
ప్రొద్దుటూరు.

# పాండవ స్వర్గారోహణము

# హరికథ



తిరుమల తిరుపతి దేవస్థానములవారి
ఆర్థిక సహాయంతో ముద్రింపబడినది.

చిత్రకవితా విశారద : జీరెడ్డి చెన్నారెడ్డి
ప్రొద్దుటూరు.

ప్రథమ ముద్రణ : ఆగస్టు 2001

ప్రతులు : 1000

సర్వస్వామ్యములు : గ్రంథకర్తవి

ప్రాప్తిస్థానము : జీరెడ్డి చెన్నారెడ్డి
12/569, కోటవీథి, ప్రొద్దుటూరు-516 360. కడప జిల్లా.

మూల్యము : రు. 15-00 లు

ముఖచిత్ర చిత్రీకరణ : చందూ ఆర్ట్సు, ప్రొద్దుటూరు.

ముద్రణ :
శ్రీ వేణుగోపాల ప్రింటర్స్,
173, శ్రీ వివేకానంద క్లాత్ మార్కెట్, ప్రొద్దుటూరు.

# తొలి పలుకుల తొలకరి

తల్లి గర్భమునుండి ధరణిపై బడిన ప్రతి శిశువు రోదించును. ఆ రోదన మొక నాదమై ఆ నాదము వలన వర్ణము, వర్ణము వలన పదము, పదము వలన వాక్యము, వాక్యము వలన లోకవ్యవహారము కలుగు చున్నది. అంతియేగాక యెడతెగని నాదము వలన సప్తస్వరములు, రాగములు, మంద్ర, మధ్యమ, తారస్థాయీ భేదములు కలుగు చున్నవి, ఆ నాదము వాగ్రూపమున భాషింపబడినపుడు భాషగను, సప్తస్వర, రాగ, తాళములచే మేళవింపబడినపుడు గానముగను పరిణతిజెంది లోకమునకు నిరంతరము కల్యాణముగూర్చు చున్నది.

చౌషష్టి ప్రకృతి విద్యలయందు కవిత్వము, గానము మిగుల నుత్కృష్టములైన విద్యలు. ప్రచేతసుడను బ్రాహ్మణోత్తముని పదియవ పుత్రుడైన ప్రాచేతసుడు ఆత్మవిద్యా విశారదుడైన నారద మునీంద్రునిచే రామమంత్రోపదేశము బొంది ఘోర తపమాచరించి వల్మీకమునుండి వెలువడి వాల్మీకి నామమున బరగి దేవభాషయైన సంస్కృతమున శ్రీమద్రామాయణ మహాకావ్యమును రచించి సంస్కృత భాష కాది కవిగా ప్రసిద్ధి గాంచెను. ద్వాపర యుగాంతమున పరాశర పుత్రుడైన యిరువదియెనిమిదవ వేదవ్యాస మునీంద్రుడు రచించిన సంస్కృత మహాభారతము నందలి ఆది, సభా,రణ్యపర్వములను మూడింటిని తెనుగు భాషయందు పద్య కావ్యముగ రచించి నన్నయ భట్టు తెనుగుభాష కాదికవిగా దీపించెను. పిమ్మట తిక్కన, యెఱ్ఱన, పోతన, శ్రీనాథాది మహాకవు లనేకులు సంస్కృత పురాణ గ్రంథములను తెనుగున రచించి కవన విద్యను పెంపొందజేసిరి.

రామభక్తాగ్రేసరుడైన హనుమంతుడు, తుంబుర నారదాది మునీంద్రులు గాన విద్యావిశారదులైనట్లు పురాణముల వలన దెలియు చున్నది. ఇంద్రసభయం దూర్వశి, మేనక, రంభ మొదలైన అప్సరసలు నాట్యము వేయుచుండినట్లు పురాణములయందు గలదు. పాండవు

లజ్ఞాతవాసము చేయుచున్న సమయమునం దర్జునుడు నాట్యాచార్యుడై విరాట పుత్రికయైన యుత్తర మొదలైన రాచకన్నెలకు నాట్యము నేర్పుచుండినట్లు భారతమునందును గలదు. శ్రీకృష్ణుడు తన వేణు గానముచే వ్రేతల యుల్లముల కొల్లగొట్టినట్లు భాగవతమున వర్ణింప బడినది. వీనినిబట్టి చూడ గానవిద్య అనేక యుగములనుండి యుండి నట్లు ఋజువగుచున్నది.

క్రీస్తు శకము 12వ శతాబ్దికి జెందిన జయదేవుడను వాగ్గేయ కారుడు సంస్కృతభాషయం దసమాన వాగ్విలాస వైభవముగలవాడు. ఈ మహనీయుడు తత్త్వచింతామణి, ప్రసన్నరాఘవ నాటకము మొదలైన యనేక గ్రంథముల రచించిన దిట్ట. రాధాకృష్ణుల ప్రేమ తత్త్వమును గ్రహించి శృంగార రసప్రధాన గానప్రబంధమును గీత గోవిందమను పేర రచించి గానవిద్య నుద్దీపింపజేసి సద్యశము నార్జించెను.

సంగీతమునందు నేటికిని వాడుకలో నున్న మాయామాళవ గౌళరాగములో విద్యార్థులకు స్వరములను బోధించు పద్ధతిని ప్రారం భించిన పురందర విఠలదాసు, (కర్నాటక సంగీత పితామహ) స్వర మేళకళానిధి యను సంగీత లక్షణ గ్రంథమును రచించిన రామా మాత్యుడు, (అభినవ భరతాచార్య) గీర్వాణభాషయందు రాగవిబోధమ యను లక్షణ గ్రంథమును రచించిన సోమనాథ పండితుడు, శ్రీకృష్ణ లీలాతరంగిణి రచించిన తీర్థనారాయణస్వామి, భద్రాద్రియందు రామా లయమును నిర్మించి చెఱసాలపాలై విముక్తి బొందిన భద్రాద్రి రామ దాసు మొదలైన వాగ్గేయకారులు 16వ శతాబ్దియందు సంగీత విద్య నుజ్జీవింపచేసి యనూన కీర్తి గడించిరి.

చతుర్దండి ప్రకాశికయను సంగీత లక్షణగ్రంథమును రచించిన వేంకటమఖి, (వేంకటేశ్వర దీక్షితులు), మువ్వగోపాల ముద్రతో 4వేల పదములను రచించిన క్షేత్రజ్ఞులు, సంస్కృతమున 3 వందల

కృతులను రచించిన ముద్దుస్వామి దీక్షితులు 17వ శతాబ్దమున సంగీత విద్యకు మిగుల వన్నె జేకూర్చిరి. 18వ శతాబ్దము ఉత్తరార్ధమునకు 19వ శతాబ్దము పూర్వార్ధమునకు జెందిన కాకర్ల త్యాగరాజుగారు కవివరేణ్యులు, గాయక సార్వభౌములు, వీణావాదన నిపుణులు, వేద, జ్యోతిష, సంగీత విద్యలయందు పరిపూర్ణానుభవము గడించిన ఆంధ్రులు. వీరు రామోపాసకులై రామ సాక్షాత్కారము పొందినట్లు చరిత్రవలన దెలియుచున్నది. త్యాగరాజ కృతులు శ్రుతులకు, మతులకు దగులని సంగీత విద్యార్థులు, విద్వాంసులు ఆంధ్రదేశమునం దుండరని చెప్పుట యతిశయోక్తి గాదు వీరు ప్రహ్లాద, భక్త విజయము, నౌకాచరిత్రము, రాగరత్నమాలిక మొదలైన గ్రంథములను 2400ల కృతులను రచించి సంగీత విద్యను సహస్ర పత్రమువలె విప్పారజేసి చిరతర సత్కీర్తి సముపార్జించిరి.

ఇట్లు క్రమముగా వృద్ధి జెందిన కవనగాన విద్యలనుండి వివిధ ప్రక్రియలేర్పడినవి. కవనమునుండి ఖండకావ్యములు, దృశ్యకావ్యములు, వచనకావ్యములు, గానమునుండి యక్షగానములు, హరికథలు, బుఱ్ఱకథలు, సుద్దులు, చెంచునాటకము మొదలైన ప్రక్రియలు కలిగినవి. యక్షగానములు, చెంచునాటకము సంభాషణలు లేని జానపద గేయరూపకములు. బుఱ్ఱకథలు, సుద్దులు నొకేతరగతికి జెందినవైనను కొలది భేదమున్నది. బుఱ్ఱకథలు నిలువబడి అభినయపూర్వకముగా చెప్పబడునవి. సుద్దులు కూర్చుండి చెప్పబడునవి. ఈ రెండును జానపదములకు చెందినవే. హరికథలు జానపదములుగాక గ్రాంథిక భాషా సమన్వితములై సంగీత, నృత్య, వ్యాకరణ, ఛందశ్శాస్త్రములచే ముడివడినవి.

తొలుదొలుత హరికథా రచనకు శ్రీకారము చుట్టినవారు శ్రీమద్దజ్జాడ ఆదిభట్ట నారాయణదాస భాగవతులు. వీరికంటె మున్ను హరికథలుండినట్లు చెప్పుదురుగాని అవి గ్రంథరూపముదాల్చి వ్యాప్తి జెందిన జాడలు గనుపించవు. ఆదిభట్టవారు సంస్కృతాంధ్రభాషా

కోవిదులు, సంగీత నృత్య శాస్త్రవిశారదులు. వీరు వాల్మీకి వలెనే ఆది కావ్యమైన రామాయణమును గ్రహించి యథార్థ రామాయణమను పేర హరికథను రచించి హరికథా రచయితలకు, హరికథకులకు పితామహులై శిష్యులకు బోధించి ప్రఖ్యాతి గాంచిరి.

వీరి తరువాత పరిమి సుబ్రహ్మణ్యదాస భాగవతులు, పెద్దింటి సూర్యనారాయణదాస భాగవతులు, బాలబ్రహ్మభాగవతులు, బాలాజీ దాస భాగవతులు పున్నయ్యశాస్త్రి భాగవతులు, తెల్లాకుల వేంకటేశ్వర గుప్త భాగవతులు హరికథలు రచించి కథాగానముచేసి శిష్యులకు బోధించిన వారిలో ప్రసిద్ధులు. వీరలందరు పరమపదించినవారు. నేటికిని హరికథా రచన సాగించుచు కథాగానము చేయుచు కథాగాన కళాప్రపూర్ణ, భక్తిప్రచార ప్రవీణ, కీర్తనాచార్యాది బిరుదముల గడించియున్నవారు రాజశేఖరుని లక్ష్మీపతిరావు భాగవతులు. వీరు రచించిన హరికథలన్నియు భక్తి ప్రధానములైనవి.

కథారచయితలుగాక గురుముఖముగా కథల నభ్యసించి కథాగానము చేసినవారిలో హరికథక సామ్రాట్ కోటా సచ్చిదానందశాస్త్రి భాగవతులు, స్వదేశమునందేగాక ఖండాంతరముల యందును కథాగానముచేసి యీమధ్యనే పరమపదించిన వీరగంధం వేంకటసుబ్బారావు భాగవతులు మొదలైనవారు ప్రసిద్ధులు. విన్నకోట రామకుమారి భాగవతి, ఇందిరాబాల భాగవతి, T. L. రాజ్యం భాగవతి మొదలైన వారు భాగవతీమణులలో ప్రసిద్ధికెక్కినవారు.

కథాకథన కథాబోధనముల యం దారితేఱినవారు, స్వరాష్ట్రముననేగాక పరరాష్ట్రములైన ఒరిస్సా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులయందును, ఆలిండియా రేడియో, మఱియు T. V. కేంద్రములయందును కథాగానముచేసి బహుమాన, బహూకృతబిరుదములు వడసినవారు నగు శ్రీమతి బందరు T.L. రాజ్యం శ్రీ T. ఆంజనేయదాస భాగవత దంపతులు ప్రొద్దుటూరు పట్టణమున నివాస

మేర్పరచుకొని కథాగానము చేయుచు పదుగురు శిష్యులకు కథలు గఱపుచుండ వారితో నాకు పరిచయమేర్పడి వారిలోని కళను నేనును, నాలోనికళను వారు నవగాహనము చేసికొని పరస్పర కళాభిమానులమై సంగీత సాహిత్యముల గూర్చి చర్చించు సమయమున శ్రీ టి. అంజనేయదాస భాగవతులు భారతమునం దేదేనియొకకథ దీసికొని హరికథ రచింపుడని నన్నుకోరిరి. నేను వారి కోరిక నామోదించి పూర్వకథా రచయితలైన ఆదిభట్ల నారాయణదాసు, పరిమి సుబ్రహ్మణ్యదాసు మొదలైనవారి రచనల పరిశీలించి వారిపోకడల ననుసరించి నన్నయ భట్టువిరచిత తెనుగు భారతము నందలి ఆదిపర్వము నుండి దేవయానీ పరిణయకథను గ్రహించి పూరుపట్టాభిషేకము దాక కథారచన జేయ సంకల్పించి జంత్ర, గాత్ర సంగీత విద్వాంసుడను గాకపోయినను శ్రీమతి T. L. రాజ్యం, శ్రీ టి ఆంజనేయదాస భాగవతుల కథాగాన శ్రవణముచే హరికథా ప్రక్రియ నర్థముజేసికొని తిశ్ర, మిశ్ర, చతురస్ర, ఖండ, సంకీర్ణ తాళగతుల గమనించి హృదయవీణపైనప్పు డప్పు డటు, నిటు మెదలాడు గాననినాదములతో గూడిన భావపరంపరలతో కీర్తనలు రచించి పద్యగద్యముల నందందు సంధించి దేవయానీ పరిణయమను హరికథ తొలుత రచించితిని. అయ్యది మాఱుమూల కథయగుటచే పెద్దగా వ్యాప్తిజెందలేదు గాని, శ్రీమతి T.L. రాజ్యం భాగవతిగారు విజయవాడ రేడియో కేంద్రమున కథాగానము చేసినారు. ఇప్పుడు తిక్కన తెనుగుభారతము నందలి స్వర్గారోహణ కథను గ్రహించి హరికథగ రచించితిని. ఇయ్యది మౌసలపర్వమునందంకురించి మహాప్రస్థానిక పర్వమున శాఖలేర్పడి స్వర్గారోహణ పర్వమున ఫలవంతమయ్యెను. హరికథా రచయితల నటులుండనిచ్చి గురుముఖముగా కథలనభ్యసించి కథాగానము చేయు భాగవతులు కఱవై అడ్డదారులు ద్రొక్కి సినిమా పాటల నడ్డముగా పెట్టుకొని యితరుల టేపురికార్డులను విని జొల్లు జల్లు గ్రామ్యపదముల చేరికచే వచ్చిన మాటలతో కథలు చెప్పు కుహనాభాగవతులు గల కాలమున నేనీపాండవ స్వర్గారోహణమును రచించుటకు కారణము నాకీప్రక్రియపైగల యభిమానము మాత్రమే.

ప్రౌఢభాగవతులు పైవిషయముల గ్రహించి నా యీ కథ నాద రింతురేని నేను ధన్యుడను. అడిగినదేతడవుగా తమ యమూల్యాభి ప్రాయములనిచ్చిన శ్రీ సి. వి. సుబ్బన్న శతావధానిగారికి, తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మప్రచార పరిషత్తు కార్యదర్శి శ్రీ హెచ్. ఎస్. బ్రహ్మానందగారికి, యీహొత్తము ప్రచురణార్థము ఆర్థికసహాయము చేసిన తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారులకు, తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్ ఎడిటర్‌గారికి, సర్వాంగ సుంద రముగా పుస్తకము నచ్చువేసి యిచ్చిన శ్రీ వేణుగోపాల ప్రింటర్స్ వారికి, ముఖచిత్రమును పొందికగా చిత్రీకరించి యిచ్చిన చందూఆర్ట్స్ వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుచున్నాడను.

సుకవిజన విధేయుడు.

జీరెడ్డి చెన్నారెడ్డి



శ్రీమతి బందరు టి. యల్. రాజ్యం,
శ్రీ టి. ఆంజనేయదాస భాగవత దంపతులు

గీ॥ ఈ కథక దంపతుల గాన మేడు వత్స
రా లు విన్న కతంబున రాగతాళ
భే ద గతులు, పురాణ కవిప్రవరుల
పద్ధతు లెఱింగి యీ కథ వ్రాసినాడ॥

కనకాభిషేక, గజారోహణ హస్తకంకణ, కవి ✆ 52239
గండపెండేర సత్కారశాలి, 'అవధాని పితామహ' (S.T.D. 08564)
డా॥ సి. వి. సుబ్బన్న శతావధాని
M. A., Ph. D., D. Litt.
ప్రొద్దుటూరు-516 360.

# సుహృదభినందనము

జీరెడ్డి వంశ మణి చె
న్నారెడ్డి వచో నిబంధనము పూర్వకవి
ప్రారూఢి మూదలించుచుఁ
జారుగతిన్ దోషరహిత శైలిన్ దనరున్

హరికథలు వ్రాసి రెండవ
పురాణకథ సంగ్రహించి బుధు లాధునికుల్
సరి తూఁగునె? చెన్నకవీ
శ్వరుఁడు రచించిన హరికథ ప్రక్కన్ నిలుపన్

ఇంత నిర్దుష్టగతి భారతేతిహాస
మూలకథ జంటితేనియ జాలువోని
వాక్సృణితిఁ బోహణించి శ్రవస్సుఖమ్ము
గూర్చు సఖు నెంత తెలచినఁ గొంచియమ్మ

— డా॥ సి. వి. సుబ్బన్నశతావధాని

**Prof. H. S. BRAHMANANDA,**
M.A., (Tel.), M.A., (Ling.), Ph.D.,
SECRETARY
DHARMA PRACHARA PARISHAD
Tirumala Tirupati Devasthanams

✆ Offi : 30893
Resi : 33877

TIRUPATI

శ్రీ ర స్తు.

# మహాభారత తాత్పర్యం

శ్రీ జీరెడ్డి చెన్నారెడ్డిగారు రచించిన స్వర్గారోహణ పర్వ హరికథను చదివి ఈ ముందుమాట రాస్తున్నాను. శ్రీ రెడ్డిగారు చాలా సమర్థ వంతంగా ఈ రచనచేశారు. హరికథకులకు చక్కని మార్గాన్ని ఈకథ అందివ్వగలుగుతుంది. శ్రీరెడ్డిగారికి హరికథకు లందరి తరపున కృత జ్ఞతలు అందజేస్తూ ఒక ముఖ్యవిషయం ప్రస్తావిస్తాను.

మహాభారతాన్ని వ్యాసమహర్షి యెందుకు రాశాడన్న విషయాన్ని హరికథకులు ప్రచారం చేయాలి. చాలా హరికథకుల్ని గమనించిన తరువాత హరికథా రూపంలో భారతాన్ని చెప్పడమంటే కొన్ని ఘట్టాల్ని చెప్పడమే అనే అర్థం యేర్పడిపోయినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఆ ఘట్టాలను వివరించినంత మాత్రంతో మహాభారత తాత్పర్యం వివరించడం సాధ్యంకాదు.

అందుకే స్వర్గారోహణపర్వ సారాంశం తెలిస్తేనే భారత సారాంశాన్ని మనం వివరించ గలుగుతాము. కొంతమంది యీపని చేస్తూవుండవచ్చు. అలాంటివారికి ధన్యవాదాలు. తెలియని యువకథ కులు తప్పకుండా యీఘట్టాన్ని చదివి మహాభారతం కేవలం కురు పాండవ యుద్ధం కాదని తెలుసుకోవాలి.

మహాభారతానికి అసలు పేరు 'జయం' అని. ఏమిటాజయం? శత్రువుల్ని యుద్ధంలో ఓడించినంత మాత్రంతో 'జయం' కాదు. కామ క్రోధ లోభమోహ మదమాత్సర్యాలనే అంతశ్శత్రువులను జయించటమే అసలైన విజయం. యుద్ధం పూర్తి అయ్యాక భీష్మాదుల వలన ఉప దేశాన్నిపొంది ధర్మరాజు 'తృష్ణాక్షయం' పొందాడు. లౌకిక జీవితం నిస్సారమని గ్రహించాడు. అందుకే యజ్ఞాదులు చేసి శాంతిని సాధించ డానికి ప్రయత్నించినాడు.

చివరికి శ్రీకృష్ణపరమాత్మని నిర్యాణంతో తమకు ఇక ఈలోకం తో పనిలేదని పాండవులు గుర్తించారు. మహాప్రస్థానానికి బయలు దేరారు. వారి వారి ప్రాప్తాలను బట్టి, పుణ్యపాప విశేషాలను బట్టి గమ్యం సిద్ధించే మహానిర్వాణ ప్రయాణం అది. ద్రౌపది, నకులసహదే వులు, అర్జునుడు, భీముడు అందరూ మధ్యలోనే విగతప్రాణులయ్యారు. చివరికి ధర్మస్వరూపమైన ఒకకుక్కతోడుగా ధర్మరాజు మాత్రమే స్వర్గం చేరాడు.

అసలు కథ ఇక్కడ ప్రారంభమవుతుంది. మానవదేహంతో స్వర్గం చేరిన ధర్మరాజుకు సోదరులమీద, ద్రౌపదిమీద మమత నశించలేదు. దుర్యోధనాదుల వైభవం మీద అసూయపోలేదు. తన వారు లేని స్వర్గం తనకు అక్కరలేదన్నాడు.

చివరికి తాను చూస్తున్నది కేవలం దేహ జనిత భ్రమ అని ఇంద్రుడు, యముడు బోధించారు. ధర్మజుడు తన మానవదేహాన్ని దేవలోకంలో వదలి కేవలం ధర్మతనువుతో మిగిలాడు. అపుడుచూస్తే కౌరవులు, పాండవులు అందరు కలిసి మహానందమగ్నులై ఉన్నారు.

ధర్మము, అధర్మము రెండూ పక్షిరెక్కలవంటివని ఈరెండింటి గతిని కాపాడుతూ, శిక్షిస్తూ భగవంతుడు తాను ఈ రెండింటికీ అతీ తుడుగా ఉన్నాడని ధర్మజుడు గుర్తిస్తాడు. అయా కౌరవ పాండవుల

నిజమైన అంశాల్ని స్వర్గంలో చూశాడు. ఆ అంశాలనుండి ఈలోకంలో అవతరించి తమ తమ భూమికలు నిర్వహించి నాటకం పూర్తి కాగానే ఆయా దివ్యాంశలలో చేరిపోతున్నారన్న గీతా సారాన్ని ధర్మజుడు గుర్తించాడు.

అవ్యక్తాదీని భూతాని, వ్యక్తమధ్యాని భారత.
అవ్యక్త నిధనాన్యేవ, తత్రకా పరిదేవనా॥

అన్న గీతాచార్యుని బోధను జీర్ణించుకొన్న ధర్మజుడు ప్రశాంత మైన యోగస్థితి నంది బ్రహ్మానంద మగ్నుడయ్యాడు. ఇలా మనిషి పురుషోత్తముడు కావటమే మహాభారతం.

ఇలా క్షుద్రమైన క్రిమికీటకాదుల నుంచి స్తంభాది బ్రహ్మపర్యం తం వ్యాపించిన సృష్టి, స్థితిలయముల చరిత్రే మహాభారతం. ఈదృష్టి తో హరికథకులు ధర్మప్రచారం చేయడానికి యీ గ్రంథం చాలా పనికివస్తుంది.

రచయితకు శుభాకాంక్షలు.

తిరుపతి
6-8-2001

హెచ్. ఎస్. బ్రహ్మానంద.

## పితృస్తుతి

సీ॥ పగ్గముల్ మోకులు పలు విధంబుల త్రాళ్లు
బిగియు జిగియుదోప బెనుప గలిగి
వడ్రంగమున క్రొత్త పద్ధతుల్ గనిపెట్టి
పనిముట్లు గావించు ప్రతిభ గలిగి
విత్తువేళ పొలాన గిత్తల నడిపించి
చాలు చక్కగ గొఱ్ఱుదోల గలిగి
చింతమాన్చెమికల చెన్నారెడ్డి కవీంద్రు
డొప్ప నాశుకవిత చెప్పగలిగి

తే॥ అంతికాసీన కర్షకస్వాంత హర్ష
కర వినూతన హాస్య వాక్ప్రౌఢి గలిగి
పర్లపాడున ధీరుడై వరలినట్టి
మజ్జనకు సన్నుతింతు సమ్మదము పొదల॥

## పితృవ్యస్తుతి

సీ॥ శ్రీశసత్పద పద్మ సేవా సమార్జితా
నందు నిత్యానంద నామధేయు
సవిధ నమచ్ఛిష్య సంఘకల్యాణ సం
ధాతను యోగ విద్యా నిధాను
నఖిల పురాణేతిహాస గీతోపని
షత్పరిశోధను సాధు చరితు
జానకీరామ విశ్వంభరీయ శతక
శతపత్ర కర్తను సత్యవచను

తే॥ ద్వాదశాబ్ద మౌనవ్రత వహన సహన
సార్థ తత్త్వ సంప్రాప్తుని సాత్త్వక గుణు
మత్పితృవ్యు ముక్తిపదస్థు మహితయశు స
భక్తి కప్రాంజలి ఘటించి ప్రస్తుతింతు॥

## భ్రాతృప్రశంస

సీ॥ పది వర్షములదాక పెదవి కదల్చి మా
టాడ నేరక మూగ యనగ నుండి
పిదప వివేక సంపద తోడ గూడిన
పలుకుల తంత్రుల తలపుకెక్కి
అంత ననేక భాషాసక్తమగు బుద్ధి
జదివి డిగ్రీలను సంతరించి
వేంకటేశ్వర విశ్వవిద్యాలయంబునం
దున్నతోద్యోగంబు లెన్నొ చేసి

ఆ॥ మంచివక్త కవి విమర్శకుండును ధీర
వరుడునై సురపురి కరిగియున్న
మత్పితృవ్యుని సుతు మద్భ్రాతమన్నామ
ధేయు సంస్తుతించి తెలచువాడ॥

## గురుస్తుతి

సీ॥ పర్లపాడుకు చుట్టు పదియూళ్ల బాలుర
కాచార్యకము చేసినట్టి గురుని
గద్వాల సంస్థాన కవివర్యుడై రాజ
సత్కార మందిన సరస కవిని
సారంగధర హరిశ్చంద్రాది నాటక
కర్తృత్వమున ఖ్యాతి గనిన ఘనుని
ఆశుధారా కవిత్వార్భటిన్ గద్వాల
నృపుని మెప్పించిన నిపుణ మతిని

ఆ॥ మత్పితరుని మేనమామ మన్నామప్ర
సిద్ధు సురపురస్థు చెమికలకులు
నేకలవ్య భక్తి నెదబెంచి గురుభావ
ముంచి ప్రణతు లాచరించువాడ॥

# వినాయక ప్రార్థన

శ్లో॥ సర్వామర సమారాధ్యం, శర్వాణీ ప్రియనందనం
కార్యాంతరాయ విఘ్నాయ, గణేశం ప్రణమామ్యహం॥

శంకరాభరణం-ఖండగతి

ప॥ నా కార్యమున కడ్డురాకు లంబోదరా!
నీ కివే నానమో వాకములురా! దొరా!

అ॥ అఖిల విద్యలకు నీ వాచార్యుడవు గాన
అకళంక భక్తి నిన్నర్చింతురా లోన ॥నాకా॥

చ॥ సర్వ శుభకార్య ప్రారంభ సంపూజితా!
పార్వతీ సుత! సుపర్వాణ వాసవనుతా!

మి॥ విద్రూప! గణనాథ! విరకీర్తి శోభితా!
చిత్కళాత్మక! చెన్నరెడ్డి సత్కవినుతా! ॥నాకా॥

# సరస్వతీ ప్రార్థన

అభేరి రాగం-ఖండగతి

ప॥ నాదురసనాగ్రమున పాదుకొను భారతీ!
నాళీకభవు సతీ! నమ్మితిని భగవతీ! ॥నాదు॥

అ॥ ఆదిభట్ల నారాయణదాస వరేణ్యుని
ఆదరించిన కృపారసదృష్టి ప్రసరించి ॥నాదు॥

చ॥ ముద్దులొలికెడు తేటతెలుగు నానుడులతో
మురిపించు లలిత గీర్వాణ శబ్దములతో
శ్రుతి రాగ తాళ సంగత కీర్తనములతో
నుతికెక్కు హావభావాది విస్ఫూర్తితో ॥నాదు॥

మి॥ అల సూర్యనారాయణాఖ్య దీక్షితదాసు
నల్ల బాలబ్రహ్మ బాలాజిదాసులను
యెన్నదగు పరిమి సుబ్రహ్మణ్యదాసునిన్
చెన్నరెడ్డిని గన్న నెనరు నాపై బూని ॥నాదు॥



## స్వభావ ప్రకటనము

నాతల విచిత్ర కవితలు కల తల
నా సన్మిత్రము ఆత్మ విశ్వాసము
నాకు తోడు కవితా కన్య మాత్రము
నాకున్న విత్తము సరస సాహిత్యము
నా అభిరుచి కవిత్వాకళాభిరుచి
నాకు మిక్కిలి ప్రీతి వినూతన కవితారీతి
నా నివాస భవనము నావిశాల మనోభవనము
నా ఆస్వాదనము నిరంతర సంగీతసాహిత్య రసాస్వాదనము
నారసనాగ్రమె నా శారద : జీరెడ్డి చెన్నారెడ్డి

చ॥ తిన, ధరియింప, నిల్వ, తగుతిండి, దుకూలము, నీడ లేని జీ
వన వనమార్గమధ్యమున పాంథుడనై సుఖదుఃఖ భేదముల్
మనమున నించుకేనియు దలంపక సత్కవితా లతాంత సం
జనిత వినూతనానుభవ సార మరందము గ్రోలు చుండెదన్॥

# పాండవ స్వర్గారోహణము

## హరికథ

కాంభోజి రాగం : చతురస్రజాతి త్రిపుట (ఆదితాళం)

ప॥ పాండవ స్వర్గారోహణ సత్కథ
ప్రవచించెద వినుడు..
శ్రవణపేయముగ సభాసదులార! పాం॥

అ॥ సకల దురిత సంఘాత వారణము
స్వర్గలోక సంప్రాప్తి కారణము ॥పాండ॥

చ॥ అంతః కలహంబులచే యాదవు
లంతరించ నీలాంబర కృష్ణులు
అల వైకుంఠమునకు జన్న పిదప
కలియుగంబు మొదలైన నాటి కథ ॥పాండ॥

వ॥ అర్జునుని అస్త్రవిద్యా కౌశలము చేతను, భీముని బాహుబలము చేతను. శౌరి కరుణా కటాక్ష వీక్షణముల చేతను పాండవాగ్రజుండు భారతసంగ్రామంబున కౌరవులను నమయించి,సామ్రాజ్య భారంబు వహించి, అశ్వమేధాది క్రతువు లొనరించి ప్రజాపరిపాలనంబు ముప్పదియైదు సంవత్సరంబులు చేసిన పిమ్మట ముప్పదియాఱవ వత్సరంబున ప్రజలకు భయము నాపాదించు మహోత్పాతంబు లనేకంబు లుత్పత్తిల్లినవి.

• మంజరులు–కన్నడ రాగం •

కఱుకైన మొరప రాళ్లం గురియుచు ఘనముగా గాలి వీచె
అరుణోదయమున బింబంబు చుట్టు నంటుకొని తమముదోచె
ఆకసముగప్పి గ్రీష్మమున దట్టమైనట్టి మంచు నిలిచె
అర్యమ నిశాకరుల పరివేషము లతిరూక్షరుచుల బొలిచె
అబ్దములు లేక నిర్ఘాతంబులు ఆకసమునుండి రాలె
అన్ని దిశలయం దుల్కలు గణింపరాని విధముగా దొరలె॥

వ॥ అట్లు ధర్మనందనుని రాజ్యంబున బహువిధ మహోత్పాతంబులు పుట్టుచు కొన్ని దినంబులు గడచిన మీదట నట ద్వారకయందు నిట్టి యుత్పాతంబులే పెక్కులు పుట్టె నట్టియెడ

తే॥ సుబల తనయ సంగరమున సుతులు చావ
నిద్ది మొదలు ముప్పదియు నాఱేండ్ల కిట్లె
యాదవ కులంబు నాశనమందు ననుచు
శాపమిచ్చినకాల మాసన్నమయ్యె॥

వ॥ అట్లు గాంధారీ శాపకాలంబు సమీపింప నొక్కనాడు వృష్ణి కుమారులు సాంబునకు గర్భిణీ స్త్రీ వేషము సంఘటించి కణ్వ నారద గాధినందనాది మునివరులకు జూపి యీ తరుణికి సంతానంబు గలుగునే యని యెకసక్కెములాడ నమ్మహా మునులు కోపించి యీ సాంబుని గర్భంబున యాదవ వంశ నాశన హేతువగు ముసలంబు పుట్టి బలరామ కృష్ణులనుదక్క తక్కన యాదవుల నాశమొందించునని శపింప సాంబుని గర్భంబునుండి ముసలంబు పుట్టె, నంత నద్దానిని వసుదేవుండు చూర్ణంబు గావించి సాగర తీరంబున బారవేయించె, నటు మీదట కొన్ని దినంబులకు కడలి జాతర నెపంబున యాదవులు సముద్ర తీరంబు జేరి మద్యపాన మత్తులై యొడలు

మఱివి పరస్పరము దూషించుకొని ద్వేషంబు పెంచుకొని ముసల సంజనితములైన ముయ్యంటు తుంగలగొని యొకరి నొకరు మోదుకొని మధుసూదనుని సమక్షంబున మరణించి, రంత దామోదరుండు దారుకుని బిలిచి నీవు కరిపురంబున కరిగి కవ్వడిం దోడ్కొని రమ్మని పనిచె.

తే॥ అట్లు పనిచిన దారుకుం డతిరయమున
దంతిపురి కేగి యాదవు లంతమొందు
టెఱుక పరచి పాండవులకు కృష్ణుడు బల
భద్రుడును క్షేమముగ నున్నవార లనియె॥

వ॥ వృష్ణి భోజాంధక యాదవ వీరులట్లు మరణించుట విని ధర్మజ భీమార్జున నకుల సహదేవులు విస్మయ విచార దుఃఖంబులు తమ మనంబుల ముప్పిరిగొన కొంతసేపు నిశ్చేష్టులైయుండి తేరుకొన శౌరి సవ్యసాచిందోడ్కొని రమ్మని తన్ను బంపెనని దారుకుండు ధర్మనందనునితో విన్నవింప నయ్యజాత శాత్ర వుండు ద్వారకకుబోవ పురందర నందనున కనుజ్ఞ యిచ్చిన.

సీ॥ పార్థుండు వేవేగ ద్వారకాపురికేగి
యాదవ క్షయమున కాత్మబొగిలి.
దేవకీపతి వసుదేవుండు మృతిజెంద
నాతని కంత్యక్రియలు పొనర్చి
బలభద్ర వాసుదేవులు తపమ్మొనరింప
వనికి బోయిరటన్న వార్త నెఱిగి.
అటజని వారు దేహంబులు చాలించి
అలవికుంఠము జేరు టరసి వగచి

తే॥ దహన సంస్కారము లొనర్చి త్వరితగతిని
మరలి మురహరు పురమున కరుగుదెంచి

రేపు సూర్యోదయంబుననే పురంబు
వననిధి మునుంగునని చిత్తమున దలంచి॥

వ॥ అట్లు తలంచి శేష స్త్రీ బాల వృద్ధ యాదవ జనులను, కరి తురగ రథ పరిజనులను విశ్వబ్సుండు తెలతెలవారు సమయం బునకు పురంబునుండి వెడలించె, నంత తూరుపు కొండపై తోయజబాంధవుండు దోచ తోయజనాభుని పురంబు తోయధి యందు మునిగె.

♦ మంజరులు—రేవతి రాగం ♦

కంసారి పురము కడలి గర్భమున గలియ నాశ్చర్యమొంది
కవ్వడియు శేష యాదవ జనులును కంట తడివెట్టి కుంది
ప్రయాణంబు సాగించి యటుమీద పంచవటి చేరుకొనిరి
పన్నుగడతోడ కిరాతులప్పుడు పరిగొనగ జుట్టుకొనిరి॥

వ॥ అట్లు సంక్రందన నందనుని సంరక్షణంబున శేషయాదవులు పయనించి పంచవటికి జేరు సమయంబున క్రూర కిరాతకులు నారీ జనంబుల చుట్టుముట్టి వివిధ ధనాపహరణంబు సేయ నారంభింప ఫల్గునుండు వారల నదలించి కలకుటమ్ము లేయ నా కిరాతులు సవ్యసాచిని సరకు గొనక తుచ్ఛ బాణపాషాణం బులు ప్రయోగింపుచుండ పార్థుండు పరమాస్త్రంబుల ప్రయో గింప బూని మంత్ర తంత్రంబులు మనంబునకు గోచరింప కున్న సునిశితనారాచముల వారిని వారింప యత్నించు సమ యమున దొనలు శూన్యంబులైన కాలవిపర్యాసంబునకు వెరగు పడి కోదండ దండంబుచే బిట్టుగా నక్కిరాతుల గొట్టి యెట్ట కేలకు తన చుట్టుంగల బలరాముని వనితలను, రుక్మిణి మొద లగు కృష్ణుని అష్ట భార్యలను, కతిపయ యాదవాంగనలను సంరక్షించె. నప్పుడా బోయలు మిగిలిన మగువలపైబడి

దోచుకొని వారికక్కరకురాని కరి రథ తురగాదుల వదలిపోవ వడముడితమ్ముండు తక్కిన స్త్రీ బాల వృద్ధుల వెంటగొని కురుక్షేత్రంబునకు జని మృత్తికావతపురంబును కృతవర్మ కుమారునకు, సరస్వతీ పురంబును సాత్యకి తనూజునకు నొసంగి పట్టాభిషిక్తులంజేసి వారల నాయా పురంబులకు బనిచి యటనుండి యింద్రప్రస్థ పురంబునకు జని.

కల్యాణి రాగం—చతురస్ర జాతి త్రిపుట (ఆదితాళం)

ప॥ ఇంద్రప్రస్థము నిచ్చి వజ్రునకు
ఇంద్రనందనుడు....
సాంద్రసత్కరుణ నభిషిక్తు జేసె ॥నింద్ర॥

అ॥ వేణుగానలోల ప్రపౌత్రునకు
బాణాసుర ప్రియ దౌహిత్రునకు ॥యింద్ర॥

మి॥ విషమకుసుమ నారాచ పౌత్రునకు
ఉషానిరుద్ధుల అనుంగు సుతునకు
వినుత సర్వాంగ సౌష్ఠవయుతునకు
వృష్ణివంశ శేషాంకురంబునకు ॥నింద్రప్ర॥

వ॥ ఇవ్విధంబున ధనంజయుండు మురారి మునిమనుమండైన వజ్ర కుమారునకు నింద్రప్రస్థ పురంబునిచ్చి పట్టాభిషిక్తుంజేసె, నంత రుక్మిణి, జాంబవతి మొదలైన కృష్ణుని భార్యలును, బల దేవుని వనితలును అనుమరణంబున కిచ్చగింప వారి నగ్నిప్రవేశంబు చేయించి, సత్యభామాది కతిపయ కాంతలు తపంబొనరింప తలంపు వెలిబుచ్చ వారిని వనంబున కనిపి అలుప్త సత్కర్ముండై అచట నుండి హస్తినాపురంబునకు జనుదెంచి, పాండవాగ్రజుని దర్శించి, యాదవనాశంబును, బలరామ

కృష్ణులు యోగనిష్ఠాగరిష్ఠులై తనువులువీడి వైకుంఠమున కరుగుటయు తానుపోయి వచ్చిన వృత్తాంతంబును సవిస్తరం బుగా వివరించిన ధర్మనందనుండు పూర్ణంబుగా విని పురందర నందనునితో నిట్లనియె.

హిందోళం రాగం–చతురస్ర జాతిరూపకం

ప॥ మనలను విడనాడి చనియె–మన నెచ్చెలికాడు శౌరి
మన కాలము చెల్లిపోయె–మన జవసత్వములు పోయె ॥మన॥

అ॥ మన సారథి మన హితుండు–మన ప్రియతమ నాయకుండు॥
మహితగుణుం డచ్యుతుండు–మౌనీశ్వర సేవితుండు ॥మన॥

మి॥ వచ్చెను కలియుగ మికమన–మిచ్చట నిలువంగరాదు
వెచ్చెర స్వర్గమునుగూర్చి–చేయవలయు ప్రస్థానము ॥మన॥

వ॥ అని శమన నందనుండు తన మనంబున బొడమిన నాకప్రస్థా నాభిలాషమును శతమన్యు నందనునితో జెప్పిన నతం డగ్ర జుని మాట కియ్యకొనె, నంత ధర్మజుడు భీమ మాద్రేయులను రావించి తన తలంపు నెఱిగింప వారును తమసమ్మతిని వెల్లడి జేయ ధృతరాష్ట్రతనూజుడగు యుయుత్సునకు నెల్ల విషయ ములు దెలిపి రాజ్యతంత్రములు నడపు వెరవు నుపదేశించి సేనా నాయకునిగా నియమించి.

అభేరి రాగం–చతురస్ర జాతి త్రిపుట (ఆదితాళం)

ప॥ పరిక్షిత్తు నభిషిక్తుం జేసెను
పాండవాగ్రజుడు.... ప్రాజ్యసామ్రాజ్యమునకు ముదమార ॥పరి॥

అ॥ హరి సత్కరుణా లబ్ధ జీవితుని
విరాట భూవరు వరదౌహిత్రుని ॥పరి॥

మి॥ పాండు ధరిత్రీపతి మునిమనుమని
పాండవ మధ్యముడౌ నరుమనుమని
ఉత్తరాభిమన్యుల ప్రియతనయుని
ఔత్తరేయు నుత్తరు మేనల్లుని ॥పరి॥

వ॥ అట్లు ధర్మనందనుండు ప్రాజ్య సామ్రాజ్యమునకు పరిక్షిత్తు నభిషిక్తుంజేసి రాజ్యపాలన ధర్మంబు లుపదేశించి, వజ్రకుమారునకు, పరిక్షిత్తునకు సుభద్రను రక్షణగానుండ నియమించి తమ వెంట రాకుండునట్లొడంబరచి భారత రణంబున మృతులైన బంధుజనులకు, మౌసలాజియందు మరణించిన యాదవులకు పరలోక సౌఖ్యంబులు కలుగుటకై ధౌమ్యాది విప్రుల రావించి

కం॥ మణిమయ విభూషణాంబర
ధన కనక గజాశ్వ గోరథంబుల నెల్లన్
వినుతయశుడు యమతనయుడు
తనివిగలుగ బ్రాహ్మణులకు దానం బిచ్చెన్॥

తే॥ అవని సురులకు దానంబు లట్టు లొసగి
శేషకాంచనరత్న విభూషణముల
క్రీడిపట్టి పట్టికి పరిక్షితున కిచ్చి
అతని కృపునకు శిష్యుగా నప్పగించె॥

వ॥ అట్లు పరిక్షిత్తును కృపాచార్యునకు శిష్యునిగా నప్పగించి పౌర జానపద ప్రవర జనంబుల నెల్లర రావించి పరిక్షిత్తుం జూపి వారితో నిట్లనియె.

• మాండు–చతురస్రజాతి త్రిపుట (ఆదితాళం) •

ప॥ ఈ పరిక్షితుడు మా ప్రియ పౌత్రుడు
ఈనాటి నుండి యేలు మిమ్మితడు ॥ఈప॥

అ॥ మమ్మెటులో మా మనుమని యటులే
నమ్మి కొలిచి శ్రేయమ్మును గాంచుడు ॥ఈప॥

మి॥ కర్మ పరిత్యాగులమై మేమిదె
కదలి పోయెదము నాకమును గూర్చి
ఎదలలోన మీ రేకొదలు లేక
పదరబో కితని పాలనన్ మనుడు ॥ఈప॥

వ॥ పాండవాగ్రజుండట్లు ఫల్గున పౌత్రుండైన పరిక్షిత్తు పాలనంబున పౌర జానపద జనంబుల మనుండని చెప్పి. తమ నాక ప్రస్థానంబు నుదాత్త భంగి ప్రస్తావించిన నప్పౌర జానపద జనంబులు ధర్మనందనా! తరతరంబ తమ్మాశ్రయించిన మమ్మిట్లు వీడుట న్యాయమా! యని చిన్నబోయిన మొగంబుల విన్నవింప శమన తనూజుండు సముచిత సంభాషణంబుల వారిని సమాధాన మానసులంజేసి రాచరికపు వస్త్రాభరణంబు లూడ్చి వల్కలాజినంబులు దాల్చిన తమ్ములును పాంచాలియు నట్ల ధరించి, రప్పుడు వారు తత్కాలోచిత కార్యంబు లాచరించి ముఖాంబుజంబులు వికసింప ప్రస్థానంబునకు సిద్ధపడి.

• శ్రీరాగం—త్రిశ్రజాతి త్రిపుట •

ప॥ ఇల్లు వెలువడి చనిరి పాండవులు
యేవురును ద్రోవదియు ముదమున ॥ఇల్లు॥

అ॥ వారి వెనుకను జనియె నొక్కటి
సారమేయము స ప్తమంబై ॥ఇల్లు॥

మి॥ శకుని కపట ద్యూతమున మును
సకల సంపదలోడి యడవికి
జన్న యప్పటి వలెనె తమకై
విన్న దనమున ప్రజలు కుందగ ॥ఇల్లు॥

వ॥ అట్లు పాండునందనులు గృహంబు వెలువడి చనుచుండ నాబాల వృద్ధంబుగా చూడవచ్చిన పౌరజనంబులును, భటసమేతంబుగా యుయుత్సుండును, సౌభద్ర నందనుండైన పరిక్షితుడును, అంతఃపుర కాంతలును పాండవుల వెనుకొని కరిపురంబు వెలువడి కడుంగడు దవ్వుగా జనిరి. అట్లు వారు వెంట వచ్చుచుండ ధర్మనందనుండప్పుడు.

తరలవృత్తము :

వెనుకకుం దలద్రిప్పి చూడక, వెంటవచ్చు జనంబులన్
కని నిలంబడుమంచు బల్కక, కర్మలన్ విడనాడి నె
మ్మనమునన్ పరచింత జేయక, మౌనమూని క్రమంబుగా
ననిలజుండు కిరీటియున్ కవ లగ్నిసంభవ కృష్ణయున్
శునకమున్ తన వెంటరా యమసూను డేగెను ముందుగన్॥

వ॥ అవ్విధంబున మార్గదర్శకుండై ముందుజను ధర్మరాజును, అయ్యజాతశాత్రవుని వెంటపోవు భీమార్జున నకుల సహదేవ ద్రౌపదీ సారమేయంబులను యుయుత్సు పరిక్షిత్ప్రౌర జనంబులు కన్నులకు కనంబడినంత దవ్వు చూచి వీడ్కొని వెను దిరిగి దుఃఖదైన్య విచారంబులు మనమ్ముల పొగిలింప, తనువులు దూల, కాళ్లు తడబడ కరినగరంబు ప్రవేశించి తమతమ వాసంబులకు జనిరి మరుసటి దినంబున.

తే॥ తన తనయుడైన బభ్రువాహనుని కడకు
జనియె చిత్రాంగద యులూచి తన జనకుని
పొంతకేగె భుజగలోకమునకు తక్కు
గల సతుల్ పరిక్షితువెంత నిలిచిరంత॥

వ॥ కృపాచార్య ధౌమ్యులిరువురు పాండవ వియోగార్తులైన పరిక్షిత్పరివార. పౌర పరిజనంబుల సమయోచిత హితవచనంబుల

నోదార్చి మనంబుల కలతదేర్చి కార్యనిర్వహణాసక్తులంజేసి రప్పుడా కరినగరంబు తొల్లిటిభంగి సకల సంపద్భరితం బై కలకలలాడుచుండె. నట పాండవులు నాకప్రస్థానంబునకు గడంగి యుపవాసవ్రత పరాయణులై గంగానది వెంతకేగి యచ్చోటనుండి ప్రాగ్దిశాభిముఖులై యోగబలంబున ననేక మహానగనదీ విపినంబులు గడచి పూర్వ సాగర తీరంబు చేరు చున్న సమయంబున

మంజరులు–మోహన

అష్ట దిశల నభమందు తనతేజ మలము కొనగదీపించి
అగ్నిదేవుండు పాండవుల యెదుట నబ్బాటుగ కనుపించి
ఎడతెగని మమత గాండీవము గొని యేతెంచిన నరుగాంచి॥
ఎట్టకేలకా గాండివము పాశి కిప్పించగ మదినెంచి॥

చం॥ దివమున కెన్నడో చనియె దేవకి సూనుని చుట్టువాలు గాం
డివ మిది యాదసాంపతిది నేమును పాతనిచే గ్రహించి ఖాం
డవము దహించునా డొసగినాడను ఫల్గుణ! నీకు, తీరె నీ
యవసరమింక గాండివము నప్పతి కప్పన సేయు మొప్పుగన్॥

చం॥ అని శిఖి పల్కగా విని బలారి సుతుం డటు సేయువాడ నే
నని తన యగ్రజానుజుల కావిషయం బెఱిగించి గాండివం
బును పరమాదరంబున సముద్రమునందున బెట్టి నంత న
య్యనలు డదృశ్యుడయ్యెను మహాపథయాన మొనర్చుపాండవుల్

వ॥ సమధిక సమ్మోదంబు తమ హృదయంబుల బొదల దక్షిణాభి ముఖులై ధరణికి ప్రదక్షిణంబుగా దక్షిణ దిశకు పయనించి దక్షిణ మహోదధి దరింజేరి యటనుండి పశ్చిమ దిశకు మరలి పశ్చిమ సాగరోపాంతంబున కేగి యటుపిమ్మట నుత్తరాభి

ముఖులై యురుతర నియమంబు పాటించి హుటాహుటి నడచి హిమాచలంబు నుత్తరించి యవ్వల సింహ శరభ శార్దూల ఖడ్గ మృగ సంతాన సంచార భీకరారణ్యంబులను, సముత్తుంగ శృంగ సంచయగగనపరికీలితపర్వతంబులను, మత్స్యమకరకమఠకర్కటాది జలచర సంకలిత సరిత్పరీవాహంబులను గడచి మేరు భూధర సమీప భూమికి జనుచున్న సమయంబున పాంచాల మహీపతి దుహిత ద్రౌపది యోగబల విహీనయై యవనిపైబడిన పవన నందనుండు పరికించి పాండవాగ్రణి కెఱిగించి శోక సంతప్తమానసుండై

శుభపంతువరాళి—ఆదితాళం

ప॥ అపగత ప్రాణియై నేలబడియె
నకటా! ద్రోవది నారయుమన్నా!

అ॥ ఈ కాంతకు నేడిట్టి దురవస్థ
ఏకతమున పాటిలె చెపుమన్నా! ॥అప॥

చ॥ పాడి కిసుమంత కీడొాదవించిన
జాడగానమీ సతివర్తనమున
పావక ప్రభవ పరమ పతివ్రత
పాపరహిత పాంచాలి సచ్చరిత ॥అప॥

వ॥ అని వడముడి కడుంగడు వగచి పాంచాలి పతన కారణ మగ్రజునడుగ నాతం డీపడతి ఫల్గున పక్షపాతిని యగుటచే నిట్టి దుర్గతి ప్రాపించెనని యనిలనందనునితో జెప్పి యా వనిత మృత శరీరమును వీడి వడివడిగా ముందునకు నడువ భీమార్జున నకుల సహదేవులు తమ యన్న వెనువెంట జనుచుండ వారల వెనుకొని ఖుర్కురం బరుగుచుండె, ఛట్లరుగుచుండ

సహదేవుండు విగతాసుడై జగతిపైబడిన గంధవహనందనుండు కనుంగొని కటకటంబడి పరేతరాట్పుతునకు జెప్పి.

తే॥ ఇత దహంకార విరహితుం డెపుడు నీకు
భక్తి శుశ్రూష గావించు వరగుణుండు
మఱియు మాకంటె మిగుల సన్మార్గవర్తి
యిట్టి గతి యీతనికి దేన బట్టెనన్న! ॥

వ॥ అని సమీర నందనుండు సమవర్తి నందనుని ప్రశ్నింప నీతండు తనకంటె ప్రాజ్ఞుండు వసుధయందెందును లేడని మనంబున నిరంతరంబు దలంచుచుండు, స్వద్దాన నిట్టి దుర్దశ పట్టెనని చెప్పి ధర్మజుండు భీమబీభత్సులును, నకులుండును, శునకంబును తన్ననుసరింపి నడచుచుండ ముందర నేగుచుండె నప్పుడు

ఆ॥ ద్రౌపదియును తనదు తమ్ముండు సహదేవు
డొకరి వెనుకనొక్క రుర్విబడుట
నరసి యగ్గలమగు నార్తి జెందుచు సోలి
మాద్రి పెద్దకొడుకు మహిని బడియె॥

వ॥ అట్లు నకులుండు పుడమిపైబడ మరున్నందనుం డన్నకుంజూపి ధైర్య శౌర్య సౌజన్య సురూపంబుల నీతని కితడెసాటి మన కురుకులంబుననే కాదు కువలయంబునం దెవ్వరును నితనికి సరిగారు నేడీ గుణరూప సంపన్నుం డిట్టి కుత్సిత దశంబొంద హేతువేమని యడుగ, నీతండు నాయంతటి వారీ ముజ్జగంబుల లేరు నేనే అప్రతి రూపవంతుడనని చిత్తంబున నెల్లప్పుడుం దలంచుచుండు నాయహంకృతివే నిట్టికీడు వాటల్లెనని ధర్మ జుండు భీమునకుంజెప్పి భీమార్జునులును కుర్కురంబును తన్ను వెనుదవుల నిర్వికారుండై ముందుగా జనుచుండె, నయ్యవసర

రంబున ద్రౌపదీమాద్రేయులు వరుసగా వసుధపైబడుట జూచి సవ్యసాచి స్వాంతంబున నివ్వటిలు నెవ్వగన్ వివశుండై వసుమతింబడిన వాయునందనుండు వెనుదిరిగి చూచి వనరుచు వైవస్వతనందనునకుం జూపి.

తే॥ అమలచారిత్రు డీనరుం డనృతమెన్న
డాడ గానము వజ్రి సింహాసనంబు
నెక్కి నట్టి ఘనుండు నే డిట్టిపాటు
వడుటకున్ హేతు వేమన్న! నుడువు మన్న!॥

వ॥ అని జగత్ప్రాణనందనుండు జమునిపట్టి నడుగ నప్పాండవాగ్రజుండు ఫల్గునుని పొలుజూచి.

• మోహనరాగం–ఖండగతి •

ప॥ అనిగూల్తు నొకనాడె ఆ కౌరవుల నెల్ల
అని పల్కి యీ నరుండు.... అటుల సేయండయ్యె ॥అని॥

అ॥ పలుకొక్క విధమాట పనియొండు విధమాట
పరికించి చూడగా పరమ దోషము భీమ! ॥అని॥

చ॥ అంతియేగాక యిత డఖిల కార్ముక ధరుల
నప్పుడప్పుడు తూలనాడు చుండెడు వాడు
దాన దానను నిట్టి దశ నేడు ప్రాప్తించె
కాన దీనికి వగవగానేల మనమింక ॥అని॥

వ॥ అని పితృపతి పుత్రుండు పురుహూతపుత్ర పతన హేతువు మారుతికిం జెప్పి యప్పార్థుని మృతదేహమును విడివి నిశ్చలచిత్తుండై చనుచుండ భీముండు మహార్తింజెంది ధైర్యముడివోవ, దైన్యంబు మనంబున గడలుకొన, నుడుగని పయనంపు

బడలికచే నోడలు గడగడవడంక, కాళ్లు తడబడ పుడమిపైబడి అగ్రజా! ధర్మరాజా! నాకీ నికృష్టపుపా టేమిటం దాపురించె నీవెఱుగుదువేని కరుణ విగురొత్తం జెప్పుమని ప్రార్థింప తమ్ముడా! నీవపరిమితాహారంబు భుజించి భుజబల గర్వంబుచే నెవ్వరిని సరకు చేయక పరుషపు బలుకు లెప్పుడుంబలుకు చుందు వందుచే నిట్టిపాటు వడితివని భీమునకుంజెప్పి యతనికై నిరీక్షింపక నిర్వికారుండై సారమేయంబు తన్ను విడువక వెనుదవిలి నడచుచుండ పాండవాగ్రజుండు ముందటం జను చుండె నప్పుడు.

సీ॥ తన దివ్యదేహ సంజనిత దీప్తిచ్ఛటల్
దశదిశాంతంబుల తారసిల్ల
తన రథాగమన నిస్వనము సుమేరు గ
హ్వరము లందున ప్రతిస్వాన మీన
తనవెంట జనుదెంచు మునిసిద్ధసాధ్య గం
ధర్వ సంస్తవన నినాదమెసగ
తన సమీప నిలింపతరువు లొక్కుమ్మడి
కుసుమ వర్షంబులు గురియుచుండ

ఆ॥ నమరనాథు డింద్రు డరుదెంచి మిగుల స
మాదరమున పాండవాగ్రజునకు
నగ్రభాగవర్తి యగుటయు నత డభి
వందనం బొనర్చె వాసవునకు

వ॥ అట్లభివందనం బాచరించిన ధర్మనందనుని దేవేంద్రుం డభినం దించి రారమ్ము దివ్యస్యందనం బెక్కుమని యాహ్వానింప కొంతే యాగ్రజుండు నాక నాయకా! నావెంట వచ్చిన నలువురు తమ్ములుం బడిన దుఃఖంబు మనంబును గలంచు చున్నది

నిజదార ద్రౌపది డప్పిగొని డస్సిపడియె. వారలు రాక నేనా కండను రాజాలను. వారును నాతోగూడి వచ్చునట్లనుగ్రహింపు మని ప్రార్థింప పాకశాసనుండు పౌరవ వంశోత్తమా! వారు దేహంబులు విడిచి దివిజలోకమున కరిగినవారు. వారలనచ్చట జూచెదవు నీవు తనువు దొలంగక రమ్మన శమనసూతి బలా రాతితో మరియు నిట్లనియె.

ఉ॥ ఏ నిలు వీడి వచ్చునపు డీసముదుత్తమ కుక్కురంబు నా
తో నరుదెంచి యిచ్చటికి తోరముగా నను నమ్మియుండుటం
దీనిని వీడి నేనొకడనే చనుదెంచిన చాల నిష్ఠురం
బౌ నిదిగూడ వచ్చుటకు నాకప! సత్కృప సమ్మతింపుమా!॥

వ॥ అని ధర్మనందనుం డనవిని యనిమిషేంద్రుండు ముఖారవిం దంబున మందహాసచంద్రికలు చిందులాడ, కడగంటి చూడ్కుల నెనరు తొలకాడ కురుకులోత్తరు నవలోకించి యిట్లనియె.

చం॥ నరవర! యిట్లు పల్కదగునా? యిది న్యాయమ? నాకమందు కు
క్కురమున కిక్క యెట్లు పొసగు న్నిలువంగ, నమర్త్యభావమే
కరణి ఘటిల్లు నిష్ఠురత గల్గదు దీనిని వీడ నీకు నా
యరదము నెక్కు పోదము రయమ్ముగ తీరని చింత లేటికిన్॥

వ॥ అని బిడౌజుండన భీమాగ్రజుండు దివిజేంద్రా! అయ్యండును ప్రభుండును నగు నినువంటి దివ్యపురుషం డాశ్రితుల యభీష్ట ములం దీర్చుట సముచితంబుగాదే! నన్నింత దవ్వు నమ్మి వచ్చిన శ్వానంబును నాకపదంబునకై పరిత్యజించ జాలనని పలికిన నప్పాండవాగ్రజునితోడ నాఖండలుండు వెండియు నిట్లనియె.

భైరవి–ఖండగతి

ప॥ ఈ కుక్కపై నీకు యింత మక్కువ యేల?
నాకలోక సుఖంబు నచ్చదేమి? నృపాల!

ఆ॥ ఇట్టులమ్మగుపట్టు పట్టదగునే యిట్టు
పట్టు విడనాడి నా పలుకులకు చెవిబెట్టు ॥ఈశు॥

మ॥ వీడితివి చుట్టలను వీడితివి రాజ్యమును
వీడితివి నిజసతిని వీడితివి తమ్ములను
వీడితివి కర్మలను వీడితి సమస్తమును
వీడజాలవె? దీని వినుత సద్గుణశీల! ॥ఈశు॥

వ॥ అట్లు నముచిసూదనుండు పలికిన పలుకు లాకర్ణించి కుంతి పెద్ద కొమరుండు వృద్ధశ్రవా! నేను నీకంటె ధర్మాధర్మంబు లెఱింగిన వాడనే? నీవెల్ల లోకంబులకు పతివి. ధర్మనిరూపకుడవు. మహాత్ములైన వారితో వాదంబు సేయదగదు. అయినను నాకు దోచిన యొప్పు నిప్పట్టున విన్నవించుట తప్పుగాదను తలంపున విన్నవించెద. నా యనుజన్ములైన భీమార్జున నకుల సహదేవులును, సతీమణి పాంచాలియు పంచత్వంబునొందిరి, వారికై వగచుచున్న వారు నా వెంట వత్తురే? మృతిజెందక బ్రతికి భక్తి విశ్వాసంబుల నన్నాశ్రయించి వెన్నంటివచ్చిన శ్వానంబును పరిత్యజించకుండుట దోషంబుగా పరిగణింపదగునేయని యనిన నరనాథునితో సురనాథుండు కృపారసం బపాంగంబుల ప్రసరింప సరస వచనంబుల నిట్లనియె.

ఆ॥ జనులు ప్రస్తుతింప తనువుతోడ నమర్త్య
భావముం గనియును నీవు నేడు
నాకసుఖము నిటు నిరాకరింప దగునె?
కుక్కురంబు కొఱకు కువలయేశ!॥

వ॥ ఈ శునక విసర్జనము సురలోక సుఖప్రదము తడయనేల? లేలెమ్ము రథమ్మెక్కుమని యమర విభుండు పలుమఱు పల్కి

పాండు భూపాలాగ్ర తనయుండు సవినయ భక్తి ప్రపత్తులుప్పతిల హిలోమీపతితో నిట్లనియె.

చం॥ అనిమిష లోకనాథ! శరణాగతు గావకయుంట మంచి మి
త్రున కొనరించు హానియును తొయ్యలి జంపుట భ్రూణహత్య బ్రా
హ్మణ హననంబు సజ్జన ధనాహరణం బురుభక్తి నన్ను బా
యని శునకంబునిందు విడనాడుటయున్ సమమైన దోషముల్॥

వ॥ కావున కుక్కుర పరిత్యాగంబుచే దొరకొను దురితంబును భరించి సురలోక సుఖంబనుభవించుటకు నామనంబు సమ్మతింపదు. ఈశునకంబును వదలకుండుట దోషంబుగా దలంపక నీయనూనానుకంప నాపై ప్రసరింపజేసి నీవుత్రివిష్టపంబునకు బొమ్ము సమిద్ధతపంబాచరించుచు నేనీవనభూమియందే యుండెదనని యుధిష్ఠిరుండు తన దృఢతర వినిశ్చయంబు విబుధాధిపునితో విన్నవించె. నట్టియెడ నప్పాండవాగ్రణి దండ నందాక శునకరూపంబు ధరించియున్న దండధరుండు నిజరూపంబు దాల్చి ధర్మరాజునకు దృగ్గోచరుండయ్యె, నయ్యాజాత శాత్రవుండు సంభ్రమాశ్చర్యానందంబులు హృదయారవిందంబున కందలించుచుండ శ్రాద్ధదేవునకు సాష్టాంగదండప్రణామంబులాచరించె, నప్పుడా కృతాంతుండు కృపార్ద్ర దృష్టి తన పుత్రుం గనుంగొని యిట్లనియె.

శ్రీరంజనిరాగం–చతురశ్రజాతి రూపకం

ప॥ ధర్మరాజ నామము–సార్థకము జేసితివి పుత్రా!

అ॥ నిర్మల మేధాసహితా!–నిరుపమాన చారిత్రా! ॥ధర్మ॥

చ॥ భక్తియుక్త మియ్యదియని పాయక శునకమునుబట్టి
బలసూదను రథమెక్కవ! భళిర! నీకు నీవెసాటి ॥ధర్మ॥

వ॥ మున్ను ద్వైతవనమున నీవిశుద్ధ హృదయ తత్త్వంబు పరికించినాఁడ. నీయనుజన్ములు నలువురు నా పలుకులు వినక నీరంబులుగ్రోలి మృతులైన నాఁడు వీరియం దొక్కని బ్రతికించెద కోరుకొమ్మన నీవు నీ తల్లుల నిరువురం దలంచి భీమార్జునులను వదలి కుంతీనందనులయం దేనొకండ బ్రతికియున్నవాఁడ. మాద్రీనందనులయం దొకండు బ్రతికి యుండుట ధర్మసమ్మతంబని నీవు నకులు నర్థించితివి. నీ ధర్మాచరణము, నీ పుణ్యవర్తనము, నీకుగల నిఖిలభూతకారుణ్యము నామనంబున దగిలి మిగుల ముదం బొదవించె, నిదియంతయు నింద్రుం డెఱింగియే తన యరదంబు గొనివచ్చి సమాదరంబున నిన్న మరలోకంబున కాహ్వానించె. మేనితోఁడ సిద్ధపథంబునంజని యందలి మాన్యులు గొనియాడచుండ నవ్యయ నాకలోక సుఖంబు లనుభవింపుమని యమునాభ్రాత పాండు తనూజాగ్రణి నుగ్గడించి పలికి తానును, శతమన్యుండును, నారదాది సుర మునులును, గంధర్వులును, మరు ద శ్వివసువులును, గలసి సమ్మోద సమాదర భావంబులు హృదయంబుల బొదల యుధిష్ఠిరు నొక్కపెట్టున యెత్తి నెట్టన రథారూఢుం జేసి తమ విమానంబుల నిరుప్రక్కల నడపికొని వియన్మార్గంబున దోడ్కొని చనుచుండ ధర్మరాజు తన తేజంబు దశదిశల బ్రాకి మిసమిసలాడ, సిద్ధుల స్తవనపాఠంబులు శ్రవణ పుటంబులు సోకి గుసగుసలాడ నమిమిషావాసంబునకు జనియె. నప్పు డాత్మ విద్యావిశారదుండగు నారదుండు పాండవ జ్యేష్ఠుని ప్రసన్నదృష్టి నవలోకించి యెల్లరు విన సంపూర్ణస్వరంబున నిట్లనియె.

మ॥ వినమే దానములం దపంబులను పృథ్వీన్ తద్దయు న్వాసిగాం
చిన రాజన్యులమున్ను వారల యశశ్శ్రీ లంతరించె న్నవ
ద్ఘనకీర్తిప్రభ లెల్లలోకముల నుద్వ్యాప్తంబులై యుండుటం
దనువుల్ వీడక వారు నాకమునకు న్రాగల్గిరే? యోగతిన్॥

వ॥ అని నారదమునీంద్రు డన విని ధర్మనందనుండు వేల్పుతాపసితో మహాత్మా! నాయనుజన్ముల కన్నులార జూచుదాక నాకీయమర పదసుఖంబు లెవ్వియు రుచింపవు. వారలెందున్న వారోచూపుడు వారలను, నాపక్షంబున నిలిచి కురుక్షేత్ర సంగ్రామంబున నిహతులైన నరపతులను, పుత్రమిత్ర బాంధవులను జూచు వేడుక సమస్తలోకంబుల జూచు వేడుక కంటె మిక్కుటంబై యున్నదని పలుక పాకశాసనుండు పాండవాగ్రణితో మృదు మధుర వచనంబుల నిట్లనియె.

హంసధ్వనిరాగం—చతురస్రజాతి రూపకం

ప॥ చనుదెంచితి వనఘాత్మక! స్వర్గమునకు తనువుతోడ
మునుపొనరించిన ఘనతర పుణ్యంబున పుడమితేడ!॥

అ॥ అమరత్వము పొందినాడ వైనను నీమది మర్త్యత
నమరిన నెయ్యంబు వీడవైతివి నేటికిని గూడ ॥చను॥

చ॥ పరదురాపమైన భవత్పదార్హులే? నీ తమ్ములు
యెలుగు మిద్ది దివ్య బుద్ధి తొలగుము మానుషభావము ॥చను॥

వ॥ కురుకులోత్తమా! సోదరబాంధవ మమతానురాగంబుల వీడి మునులను, సిద్ధ సాధ్యగంధర్వ మరుదశ్వినులను శుభదృష్టిం జూడుమని బిడౌజుండన ధర్మనందనుం డాతనితో మహేంద్రా! మీరిటు లేమి సెప్పినను నా యనుజ, తనుజ మిత్రకళత్రంబుల కన్నులం దనివి దీర జూచు దనుక నా హృదయంబునకు కుదురు గలుగదు వారలం జూచి క్రమ్మఱవచ్చి నాకలోకసుఖం బులనుభవించెదనని తన తుది కోరిక నివేదింప దివిజపతి అందు లకు సమ్మతించి యొక దేవదూతను రావించి.

ఆ॥ ధర్మనందనునకు తమవారలం జూడ
కాంక్ష చిత్తమందు గలిగె గాన
నటకు దోడ్కొని చని యఖల బంధుల జూపు
మనుచు దేవదూత కానతిచ్చె॥

వ॥ అట్లమరేంద్రుం డానతీయ దేవదూత సగౌరవంబుగా ధర్మ తనయుని దోడ్కొనిపోవుచుండ నారదాది మునులును, దేవ గణంబులును కుతూహలంబున వారల వెంబడించి చనుచుండి రట్లు చనునెడ కట్టెదుర నున్నతాసనంబునం గూరుచుండి వీర లక్ష్మిచే విరాజిల్లుచు సురాంగనలు చుట్టుంచేరి పరిచర్యలు సేయుచుండ స్వర్గ సుఖానుభూతిం దేలు చున్న దుర్యోధనుని ధర్మనందనుండు వీక్షించి దేవమునుల నుద్దేశించి యిట్లనియె.

• ఖరహరప్రియరాగం–చతురస్రజాతిత్రిపుట (ఆదితాళం.) •

ప॥ ఇతడతిలోభోప హతమానసుడు
యితని మూలమున.... నెల్లభూపతులు రణ నిహతులైరి ॥ఇత॥

అ॥ పరమసాధ్వి ద్రౌపదిని సభలోన
పరాభవించిన పాపాత్ముకుడు ॥ఇత॥

మి॥ దూరదృష్టి రహితుండు మూర్ఖుండు
క్రూరుండు దీర్ఘకోపి కుత్సితుడు
కులవినాశకుడు ఖలు డిట్టివాని
గలసి యేనెట్లు మెలగు దివ్యోట ॥ఇత॥

వ॥ ఈ జ్ఞాతిద్వేషితోడి సంసర్గంబు నాకేల? మునివరులారా! భీమార్జున నకుల సహదేవులు, పాంచాలియు నెందున్నవారో నన్నచటి కనుపుడని యమ నందనుండు వెనుదిరుగ నారదుండు చూచి నెమ్మోమున చిఱునవ్వు వెన్నెలలు వెన్నార నిట్లనియె.

మంజరులు–ధన్యాసిరాగం

ఇతడు సమరమున తనువువీడి గద!యిచ్చోటికి చనుదెంచె
ఇతడు క్షత్రధర్మముననే గదా! క్షితిపతుల సంహరించె
అదిపాపమేటి కగును చర్చింపు మనఘ! నీదునెమ్మదిని
అమరులును పుణ్యకర్ములును జూతు రత్యాదరమున నితని॥

వ॥ పౌరవవంశోత్తంసా! దుర్యోధనుండు మాయాద్యూతంబున మీ రాజ్యలక్ష్మి నపహరించుటయు, పాంచాలిని పరాభవించుటయు నిచటదలంచుట సముచితంబుగాదు. ఇది పుణ్యలోకంబు మనో వికారంబులగు యీర్ష్యారోషంబులువదలి సమభావంబు నొందు మని నారదుండు పలుక పాండవాగ్రణి సురమౌనితో నిట్లనియె.

తే॥ స్వకుల విధ్వంసకుడు మహాపాతకుండు
దుర్మదాంధుండు సజ్జనద్రోహియైన
యీ నృపాధము డమర సన్మానితుడయి
మనునటే! త్రిదివంబున మౌనివర్య!॥

వ॥ ఈ దుర్యోధనుని వృత్తాంతం బటులుండనిండు. కురుక్షేత్ర సంగ్రామంబున మృతులైన సమస్త బంధువులకు నేను తిలోదకంబు లిచ్చుచుండ మజ్జనయిత్రియైన కుంతి కర్ణుండు తన కుమారుండని నుడివి యతని జన్మప్రకారం బంతయు వివరించె. అది మొద లమ్మహాత్ముండు తలంపునకు వచ్చినపుడెల్ల నా యుల్లంబు తల్లడిల్లుచుండు. రణశూరుండగు నతని చరణంబులు నాతల్లి చరణంబులట్ల సభక్తికంబుగా భజించు భాగ్యంబబ్బమికినే నెంతయు జింతించుచున్నవాడ. ఆవీరాగ్రణి నాకన్నగారగుట యెఱుంగక నగారినందనుని బంపి చంపించితిని. ఏతద్దోషమను కంటకంబు నామనంబున నాటి నేటికిని సంకటపెట్టుచున్నది. ఆ మహోదారుం డెందున్నవాడో నాకు జూపుడు. మరియు

రణాగ్నికి తమ ప్రాణంబుల హవిస్సులుగా వేల్చిన విరాట ద్రుపదయుధామన్యులను, శంఖాది తదీయ జ్ఞాతులను నేనవశ్యంబు జూడవలయు. ప్రాణసమానుండగు పవమాననందనుని, బిడౌజతేజోవిరాజితుండగు బీభత్సుని, అశ్వినులంబోలు నకుల సహదేవులను, సహజ సద్గుణశాలినియైన యాజ్ఞసేనిని కన్నులార గనుదాక నే నిలుపజాల. వారికెవ్వరికి సురలోకావాసంబు దొరకొనని పక్షంబున సహోదర రహిత స్వర్గంబున నుండుటకు నాడెందం బొడంబడదు. కావున దివిజ మునివరులారా! వావారున్న చోటునకు నన్ను దోడ్కొనిపొండు. వారెచ్చోట నున్న నాకచ్చోటు పుణ్యలోకంబుగా భావించెదనని యుధిష్ఠిరుండు పలుక నాతనియాననం బాలోకించి యనిమిషమును లిట్లనిరి.

ఆ॥ ఎద్ది నీమనమున కిష్టమౌనో దాని
నాచరింపవలయు ననుచు మాకు
నప్పగించె నింద్రు డందుచే నీ చెప్పి
నట్ల చేయువార మనఘ! మేము॥

వ॥ అని నిలింపమునివరులు పృథాసుతాగ్రణితో సానుకూల వచనంబులు పలికి దేవదూతను కనుంగొని నీ విమ్మహితాత్ముని భీమార్జున మాద్రేయులున్న నెలవునకుం దోడ్కొని పొమ్మన, నాదేవదూత ధర్మనందనుని సాదరంబుగా నిందు రమ్మని తాను ముందటం జనుచుండ ధర్మరాజతని వెంటం జనుచుండె నప్పుడు.

కాఫీరాగం—చతురస్రజాతి త్రిపుట (ఆదితాళం)

ప॥ ఆ మార్గము కడు ఘోరం బయ్యెను
అస్థికేశమాంసాంత్ర రక్తముల ॥ఆమా॥

అ॥ కాకఘూకారవమ్ముల చేతను
కటిక చీకటులు క్రమ్మట చేతను ॥అమా॥

మి॥ మశకదంశములు మూగుట చేతను
అసహ్యకర దుర్వాసన చేతను
క్రిమికీటక సంచారము చేతను
త్రిముఖ నిశాతాశ్మమ్ముల చేతను ॥అమా॥

వ॥ ఆ పథంబున కౌంతేయాగ్రజుండు కొంతదవ్వరిగి వైతరణి యను పేరంబరగిన యేఱును, తత్తీరంబునం దాయసకంటకంబులం బోలి శోభిల్లు నిశితాసిపత్ర వనంబును, మరియు నానదియం దారంగ్రాగిన తైలంబువలె సలసలక్రాగి నలుదెసలకు పొంగిపొరలుచున్న నీరంబును, తత్ప్రదేశంబున బహువిధ నరకబాధలం బడుచున్న పాపకర్ములనుజూచి దేవదూతతో దివ్యపురుషా! మనము పోదలంచిన చోటిచటికెంత దూరంబున గలదు, ఈ ప్రదేశం బంతయు దేవతాధీనంబేకదా! అనియడుగగా దేవదూత ధర్మనందనునితో యీప్రదేశంబు బృందారకాధీనంబు, యిదియే మనము రావలసిన చోటని చెప్పిన విని యుధిష్ఠిరుం డతిబీభత్సము, పూతిగంధము నగు నచ్చోట నిలువక మరలిపోవం జూచిన నచటనున్న పాపకర్ములలో కొందఱు ధర్మజు నుద్దేశించి యిట్లనిరి.

• హంసానందిరాగం—చతురస్రజాతి రూపకం •

ప॥ నిలువు మిచట సుమహితాత్మ! నీవు కొంత సేపైనా
నీ నిండు కృపార్ద్ర దృష్టి నిగుడించుము మాపైనా ॥నిలు॥

అ॥ నీదురాక చేతనె మా నెమ్మనములు వికసించెను
నీ దర్శనభాగ్యముచే నిరయ యాతనలు వాసెను ॥నిలు॥

మి॥ నీతను సౌగంధ్యముగొని యేతెంచెడు మారుతంబు
మాతనువులపైన వీచి మాకు సౌఖ్యమును గూర్చెను ॥నిలు॥

వ॥ అని పాపకర్ములు తమ దీనావస్థను దెలిపి యిచటనే నిలువుడని ప్రార్థింప ధర్మతనయుండు అయ్యో! యెంత బెట్టిదపు బాధలం బడుచుండిరో వీరని కారుణ్యం బొలయ నిలిచి మీరెవ్వరని యడుగ కర్ణుండ, భీమసేనుండ. నకులుండ, సహదేవుండ, ద్రౌపదిని, ధృష్టద్యుమ్నుండ ద్రౌపదేయులమని చెప్పిన విని విషాద విచారంబులు మనంబున బొమడ నిట్లు చింతించె,

ఆ॥ దైవమిట్లు చేసెనే వీరినక్కటా!
అక్కటికము సుంతయైన లేక
ధర్మము చెడి దారిదప్పి నేటికి వీరి
కిట్టిపాటు దెచ్చిపెట్టె నాక్కొ!॥

వ॥ శతాంశంబేని లోకమునకు మేలు సేయని దుర్యోధనుండు దేవపూజ్యుండై దివిజలోకంబున దివ్యసుఖానుభూతిం దేలుచుండ నావారీ నరకమునకు రావలసినంత కిడేమి చేసిరి.? విధికింత పక్షపాతమా?

• ముల్తాన్ రాగం–ఖండగతి •

ప॥ నాదు తమ్ములకు దుర్భర మహా నరకమా?
అదుష్టధార్తరాష్ట్రాగ్రణికి నాకమా? ॥నాదు॥

అ॥ ఒక యాగకాలియం తేనియును దురితంబు
అకట! సేసియెఱుంగ నట్టి సుగుణాఢ్యులకు ॥నాదు॥
సతదాన నిరతులకు సత్కృపార్ద్ర మతులకు
సజ్జన పూజితులకు సాధు జనావనులకు
సన్మార్గవర్తులకు సముదాత్త చరితులకు
సదక్షిణాంచిత బహు సవన కర్మరతులకున్ ॥నాదు॥

వ॥ అని కడుంగడు చింతించి యిది కలయో, ఘనమాయయో, లేక నిక్కమో, చిత్తవిభ్రాంతియో తెలియజాలకున్న వాడనేనని వ్యాకులేంద్రియుండై కొంత సేపునకు తేరుకొని యింద్రునిపై నలుక పొడమ దేవదూతం గనుంగొని ఆర్యవర్యా! నీవెవ్వరి దూతవో వారికడ కేగుము నాసహోదర సతీసుతబాంధవు లిచట దుఃఖార్తితులై యున్నవారు కావున నేనిందేయుండెద నచటికి రానని పురందరునకుం జెప్పుమన విని దేవదూత మహేంద్రుని పాలికింజని.

ఆ॥ ధర్మనందనుండు తనతోడ నాడిన
పలుకు లన్నియు బలవైరితోడ
జెప్పవిని యతండు వెచ్చెర న్వచ్చె న
చ్చటికి సంయమిసుర సహితుడగుచు॥

వ॥ సమవర్తియు పుత్రవాత్సల్యంబున నజాతశాత్రవు ననునయించుట కచ్చోటికి సత్వరంబుగా నరుదెంచె నా సమయంబున.

సీ॥ అందాక నచ్చటం గుందు పాపాత్ముల
నారక యాతనల్ తీరిపోయె
నెఱవి భక్షించెడు గృధ్రవాయసఘూక
నికరంబు లచట గన్పింపకుండె
నామిషంబు రుధిర మస్థిపుంజములు కే
శవ్రాతములు నదృశ్యంబులయ్యె
నతి భీకరాసిపత్రాటవీ సంయుక్త
వైతరణియు గనుపట్టకుండె

గీ॥ నాసికానందకర సుగంధము వహించి
మందపవనంబు వీచె తమంబు విచ్చె
దిశలు పదియును క్రమముగా తెలతెలనయి
కన్నులకు విశదంబుగా కానబడియె॥

వ॥ అంతట మహేంద్రుని వెంట వచ్చిన వసురుద్రాదిత్య గరుడ గంధర్వ సిద్ధసాధ్యులు ధర్మనందనుని సమీపంబున గుమిగూడి యక్కురుకులోత్తరు గుణంబు లొకరితో నొక రుగ్గడించి యగ్గించుచుండ దేవేంద్రుండు సంయమిసుర సమేతంబుగా పాండవాగ్రజునిచేరం జని సాంత్వన వచనంబుల నిట్లనియె.

మంజరులు–దేశిరాగం

నీవిందుంటకు దేవతలెల్లరు భావమున మిగుల వగచి
నిను దోడ్కొనిపో వచ్చియున్నారు నీవు కినుక బోవిడిచి
అవ్యయనాక సమృద్ధ సౌఖ్యముల నవనీశ! యింక కనుము
అదియుగాక నేనొక్కటి చెప్పెద సావధానముగ వినుము॥

బిలహరి రాగం–చతురస్రజాతి త్రిపుట (ఆదితాళం)

ప॥ వినుము ధర్మజా! వేదకథిత మిది
వివరించెదనే విశదముగా నీకు॥

అ॥ అవనీనాయకు డైన ప్రతి యొకడు
అవశ్య మీ నరకస్థలి కనవలె ॥విను॥

మి॥ పాపపుణ్యములు రెండు జోకలై
పరిఢవిల్లు చుండును సంతతంబు
పాపంబున నారకము పుణ్యమున
భవ్యనాకంబు ప్రాపించు చుండు ॥విను॥

వ॥ అల్ప పుణ్యంబు చేసినవాడు తొలుదొలుత స్వల్ప నాకసౌఖ్యంబు లనుభవించి పిదప నధిక నరకయాతనల ననుభవించు నధిక పుణ్యం బాచరించినవాడు మొదట స్వల్ప నరకబాధల బొంది పిమ్మట నధిక నాకసుఖంబుల బొందు. నేను నీకుత్తర

కాల నాకసుఖంబులు సంఘటించుటకై మున్నుగా నిన్నిచ్చోటికి బంపితిని. నీవిచట కటకటం బడుచుండుట యెఱింగి దీనిని దెలుపుటకై నేనిటకు మరల రావలసె. దైవవిహితమును తప్పింప రానిదియు నగు నత్యల్ప దుఃఖం బనుభవించితివి. ఇంక భూరితర దివ్యసుఖంబు లనుభవించుచు నాతోడ విహ రింపుము. కర్ణుండు స్వర్గధామంబున తేజరిల్లుచున్నవాడు. అమ్మహనీయుని గాంచి మనంబునగల కలక వీడుము. భీమా ర్జున నకుల సహదేవులును, ద్రౌపదియు, ద్రౌపదేయులును, భవత్సైన్య సంబంధులగు రాజన్యులును నాకప్రాప్తులై వరలు చున్నవారు వారింజూచి సమ్మోద స్వాంతుండవగుము. నిన్నభి నందింప వచ్చిన నిలింపమునివర గరుడ గంధర్వ సిద్ధసాధ్య సత్తములం జూడుమని పలుక నప్పాండవాగ్రేసరుండు వినయ వినమితాంగుండై వారి కభివాదంబు సేసె. వారలా యుధిష్ఠి రుని సమ్మోద హృదయులై పలువిధంబుల ప్రస్తుతించి, రయ్యెడ దండధరుండు తన తనయుని చేరంజని యిట్లనియె.

తే॥ క్షితిప! ముమ్మాఱు నిను పరీక్షించినాడ
మున్ను ద్వైతవనంబున, నిన్న మేరు
పర్వతము చెంత కుక్కతో వచ్చినపుడు,
నిపుడు నీ తమ్ములున్న యీ యిక్కయందు॥

వ॥ నీ మనంబున చలనం బేనాడును లేదు. శమ దమ సత్యంబులు నీకు సహజ గుణంబులు. నాయందలి భక్తియు నీకగ్గలంబు. నాచే పరిశోధితుండవయితివి. రాజగువాడు తప్పక నరకంబు చూడవలయు గాన నందులకయి నేనును. వాసవుండును మిగుల కీడగు నిచ్చోటికి నిన్ను బంపితిమి ప్రభాకర ప్రభంజననంద నాదుల నరక దుఃఖాను భావంబులు మాచేసిన మాయలగుట నీకు దెలిసె. వారు పుణ్యలోక వాసులగుట పాకశాసనుని పలుకుల వలన తేటపడియెనని చెప్పి వెండియు నిట్లనియె.

బేహాగ్ రాగం—ఆదితాళం (చతురశ్రజాతి త్రిపుట)

ప॥ ఈగగనధునీ పావన జలముల
వేగ మునిగి రమ్ము.... విశ్వసంవ్యాప్త యశోవిశాల!

అ॥ వీడును మానుష వికృతు లన్నియును
కూడుకొను దివ్యగుణములు నిన్ను ॥ఈ॥

మి॥ అమరావాస విహారులై మిగుల
ఆనందించెడు నీయనుజన్ముల
దారాసుత బాంధవుల నెల్లరను
దర్శింపనీకు తఱియయ్యె నేడు ॥ఈ॥

వ॥ అని చెప్పి దండధరుండు తానును పాకశాసనుండును పాండవాగ్రజుని దోడ్కొని, దివిజమునులు దివిజగణంబులు తమ వెంట వచ్చుచుండ వియద్వాహినీ తీరంబు చేరంజనిరి. అప్పుడార్యస్తవనంబులు శ్రవణంబులకు విందొనరింప యుధిష్ఠిరుండు మందాకినీ పావన జలంబుల మంగళస్నానమాచరించి మానుష దేహంబు విడిచి మహిత దివ్యదేహంబు ధరించి స్నేహవైర మత్సరాభిమాన గర్వశోకాదులైన హృద్గత వికారంబులు దొఱంగి ధూమవిరహిత పావకునివలె ప్రకాశించుచు యమ మహేంద్ర నారదాద్యుదార పురుషుల నభినందించుచు వారిం గూడుకొని యటనుండి యొక్క మనోహర ప్రదేశంబునకుం జని ముందట.

సీ॥ తళుకొత్తు నవరత్నములను దాపిన కన
కాసనాధిష్ఠితుం డైనవాని
దిక్కులన్నిటను కాంతి వితాన మీను ది
వ్యాంగ విస్ఫూర్తి వెలైనవాని

మందహాసము మోమునందును శంఖ చ
క్రములు హస్తములందు గలుగువాని
నిజరూపములు మౌళి నిలిపి సుందర పూరు
షులు భక్తిఁగొల్వంగ వెలయువాని

తే॥ స్నేహ సవినయ భావముల్ చెంగలింప
పార్శ్వమందు గూర్చుండిన పార్థు తోడ
సరస సంభాషణంబులు సలుపువాని
అల్ల నారాయణుని గాంచె యమసుతుండు॥

వ॥ అట్లు ధర్మనందనుండు నరసహితుండైన నారాయణుని గాంచి అమందానంద హృదయుండై యొండొక దిక్కున ద్వాదశాదిత్యులగూడి త్రయోదశాదిత్యుండన తేజరిల్లుచున్న కర్ణుని, మరుద్గణ మధ్యంబున శోభిల్లుచున్న మరున్నందనుని, అంగంబులు పూర్వభంగి నొప్ప నశ్వినీ దేవతల సమీపంబున విరాజిల్లుచున్న నకుల సహదేవులను జూచి, యటువైపున నొక్కపట్టున నుదయ భానుచ్ఛవిఁదేజరిల్లుచున్న నొక్క లలనామణిం గాంచి కనుంగొన జాలక పాకశాసనునితో నిట్లనియె.

సరస్వతి రాగం–చతురస్రజాతి త్రిపుట (అదితాళం)

ప॥ ఎవ్వరి పతియో యీ తరుణీమణి
యింత కంతేని....యెఱుగనైతి చెప్పుము వజ్రపాణి॥

అ॥ అపుడే పొడివిన అదిత్యద్యుతి
నలరుచున్న యది అతిరూపవతి ॥ఎవ్వ॥

మి॥ తలిరు విలుకాని ధర్మపత్నియో
అలవై కుంతుని అత్మజాయయో

ఫాలలోచనుని భామామణియో
బాలవయ్యె కన చక్షువులు రెండు ॥ఎవ్వ॥

వ॥ ఈ జవ్వని యెవ్వరో నా కెఱుగం జెప్పమని పాండవాగ్రజుం డాఖండలు నడుగ నాతం డీవనిత పవనాగ్ని సంభవించి ద్రుపదుని దుహితయై ద్రౌపదీ నామంబున బరగి భవదనుభూతి సెల్లించి భవునాజ్ఞ నిర్వహించి వచ్చినది. అటు వైపున నున్న రమ్యాకారులు గంధర్వవరు లేవురు నిక్కమలాయతాక్షియందు మీకు జన్మించిన కుమారులు. ఇదే యిటుజూడుము నీ తండ్రి కగ్రజుండు ప్రకట గంధర్వపతి ధృతరాష్ట్ర నాముండు. అదే ఆ దిక్కున నున్న సిద్ధసాధ్య విశ్వ దేవగణంబులంగూడియున్న వారు తత్తదంశ సంభూతులయి వాసుదేవాను చరణ పరాయణులై వర్తించిన సాత్యకి కృతవర్మాది యాదవులనెల్ల దిలకింపుమని పలికి మహేంద్రుండు మఱియొక దిక్కునకు కరంబు చాచి యిట్లనియె.

క॥ వీరాభిమన్యుడు సమి
ద్ధీరు డితడు చంద్రుభంగి దీపించు తను
శ్రీరమ్యుడు సౌభద్రుడు
సారగుణాఢ్యుడు తదంశ జాతుడు కంటే!॥

వ॥ అని అమరపతి యమతనయున కభిమన్యుంజూపి చెప్పి తమ కభిముఖముగా విమానారూఢుండై వచ్చుచున్న పాండురాజుం జూచి

తే॥ కుంతియును మాద్రియును తన కుడి యెడమల
నిరువు రాసీనలై యుండ నిటె విమాన
మెక్కి నీజనకుడు పాండు డేగుదెంచు
చున్నవాడు కనుంగొను మోనృపాల!॥

వ॥ అని పలికి పాండవాగ్రణికి పాండు భూపాలుంజూపి పాకశాస నుండు మఱియొకవైపునకుం దిరిగి.

శంకరాభరణం రాగం–చతురస్రజాతి త్రిపుట (ఆదితాళం)

ప॥ అదె వసువులకడ కదిసియున్నాడు
అతడే నీముత్తాత భీష్ముడు ॥అదె॥

అ॥ ఇదె యాదిక్కున దివిజగురుని కడ
ముదమున ద్రోణుండున్నాడు చూడు ॥అదె॥

చ॥ గంధర్వ యక్ష గుహ్యకగణముల
గలసి మెలంగెడు ద్రుపద విరాటుల
తదీయ సోదర తనుజ వర్గముల
తక్కిన కేకయ పాండ్యులం గనుము ॥ అదె ॥


వ॥ అని అనిమిషేంద్రుడు భీష్మ ద్రోణులను, ద్రుపద విరాటులను తదీయానుజతనుజ వర్గంబులను, కేకయపాండ్యాది నానాదేశాధీశులను ధర్మనందనునకు వేఱు వేఱంజూపి చెప్పి పాండవాగ్రజా! భవత్పక్షంబున నిలిచి కురుక్షేత్ర మహాహవంబున దేహంబులు విడిచి యుత్తమ లోకంబులు వడసిన వారినెల్లరం జూడుమని చెప్పి చూపిన నయ్యుధిష్ఠిరుండు చూచి అఖిలాండ కోటి బ్రహ్మాండంబుల దర్శించిన యంతకంటె నెక్కుడగు సమ్మోదంబు నొందె. నట్లు దేవేంద్రుని తోడంగూడి విహరించుచు నిద్రాహారదాహ జరావిరహిత దివ్యసుఖంబు లనుభవించుచు బహుకాలంబుండి అటుపిమ్మట.

తే॥ తొల్లి తేజస్స్వరూపంబుతోడ తనదు
తనువునం జొచ్చియున్న విద్యామయాత్ము
డైన విదురునితోగూడ నయ్యజాత
శాత్రవుడు నిజజనకుని శమను గూడె ॥

వ॥ భీమసేనుండు మరుత్తుంగూడె, నరుండు నారాయణు సన్నిధి నిలిచె, నకుల సహదేవు లశ్వినీదేవతలం గలసిరి. ద్రౌపది మహాలక్ష్మియం దైక్యం బయ్యె. ధృతరాష్ట్రుండు గాంధారీ సహితంబుగా కుబేరలోకంబున నిలిచె. పాండురాజు కుంతీ మాద్రీ సహితుండై మహేంద్రుని భవనంబునందు నిలిచె అభి మన్యుండు చంద్రుం గూడె. ద్రోణుండు బృహస్పతిం గూడె. శకుని ద్వాపరాత్మకుండయ్యె. దుర్యోధనుండు స్వర్గ నరక సుఖదుఃఖానంతరంబున కలియం దైక్యంబయ్యె. దుర్యోధనుని సహోదరులైన దుశ్శాసనాదులు నాకనరకానుభవానంత రంబున యాతుధానులం గలసిరి. కర్ణుం డాత్మజనకుండైన సూర్యుని గలసె. భీష్ముండు వసువుగాన వసువులం గూడి యుండె. ద్రుపదుండు, విరాటుండు, ధృష్టకేతుండు, భూరిశ్ర వుండు, శల్యుండు, శంఖుండు, ఉత్తరుండు విశ్వానామ దేవ తల గలసిరి. ధృష్టద్యుమ్నుండు హుతవహుని గూడుకొనె. వృష్ణిభోజాంధకులెల్ల గుహ్యకగణంబుల గూడిరి. మఱియు తక్కినవార లాయాగణంబులం గూడిరని వైశంపాయనుండు పరిక్షిన్నందనునకు జనమేజయునకు పాండవ స్వర్గారోహణ కథ సాకల్యంబుగా జెప్పిన జనమేజయుండు పూర్ణంబుగా విని పరమానంద భరితుండయ్యె.

క॥ పాపంబు జేసి నారక
కూపంబుల బడక శుభము గోరుచు పుణ్యం
బేపార జేసి లోకులు
ప్రాపింతురుగాక! నాకపద సౌఖ్యములన్॥

శుభం.



## జీరెడ్డి చెన్నారెడ్డి

జననము : 04-10-1935

స్వస్థానము : పర్లపాడు గ్రామము

తల్లిదండ్రులు : కీ॥ శే॥ జీరెడ్డి చిన్న వేంకటసుబ్బారెడ్డి
రామాంబగారలు

వృత్తి : వ్యవసాయము

ప్రవృత్తి : కవితా కళాభిరుచి

విద్యాభ్యాసము : వీధిబడిలో 3 నెలల పరిధిలో 3వ తరగతి

ప్రస్తుత నివాసము : ప్రొద్దుటూరు

చేసిన కవితా ప్రక్రియలు : ఆశు, శతక, అవధాన, గేయ, గర్భ,
బంధ, చిత్రకవితా, హరికథాప్రక్రియలు

రచించి ముద్రించిన గ్రంథములు : చిట్టిపాప, (సుభాషిత ద్విశతి)
దేవయాని పరిణయ హరికథ,
పాండవ స్వర్గారోహణ హరికథ
విద్యార్థి నీతిబోధిని

అముద్రితములు : నరసింహ శతకము, మారకాపురి చెన్న శతకము
లయబద్ధ లలిత గీతములు.